## క్లుప్తంగా

### సర్పంచ్ ఉదారత



గోతులు పూడ్చేందుకు ట్రాక్టర్‌తో తెచ్చిన మట్టి

బూర్జ: సింగన్నపాలెం గ్రామ ప్రధాన రహదారి (పాలకొండ-శ్రీకాకుళం)పై ఉన్న ప్రమాదకరమైన గోతులను గ్రామానికి చెందిన నాయకుడు తులగాపు శ్రీనివాసరావు తన సొంత ఖర్చులతో పూడ్చి ఉదారతను చాటుకున్నారు. ట్రాక్టర్‌తో కొండ గ్రావెల్ తీసుకొచ్చి గోతులను పూడ్చారు. సింగన్నపాలెం గ్రామ సమీపంలో తరచు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిపై 'గోతులు పూడ్చరూ' శీర్షికతో 'సాక్షి'లో కథనం వచ్చింది. దానికి స్పందించి వెంటనే గోతులు పూడ్చారు.

### గెస్ట్ లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధనకు గెస్ట్ లెక్చరర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవాు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని.. 20వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99894 84645 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

● అలాగే స్కిల్ డవలప్‌మెంట్ కోర్సులైన కంప్యూటర్ డెటా ఎంట్రీ, డెటా రీకవరీ ఎజెంట్ కోర్సులు నాలుగు నెలల కోర్సు బోధించుటకు టూటర్స్ కోరకు దరఖాస్తులు ఆహ్వానిస్తుమని ప్రిన్సిపాల్ శ్రీరాములు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యార్థులు పీజీ కంప్యూటర్స్, ఎంకామ్, ఎంబీఏ చేసి ఉండాలన్నారు. ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 95532 92734 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### అధ్వానంగా పాఠశాల ఆవరణ



చెత్తాచెదారంతో పాఠశాల ఆవరణ

సరుబుజ్జిలి: చినకాగితాపల్లి పంచాయతీ బుడ్డివలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ అధ్వానంగా మారింది. ఇక్కడ కొంతమంది వారి పశువులను కడుతుండడంతో పారిశుద్ధ్యం క్షీణించింది. పశువుల మలమూత్రం విసర్జనతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పక్కనే మంచినీటి బోరు కూడా ఉంది. అలాగే ఇదే పాఠశాలను ఆనుకొని అంగన్‌వాడీ కేంద్రం నడుస్తోంది. పరిస్థితి చేయిదాటకముందే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో శనివారం మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు టెక్కలి డివిజన్ ఈఈ జి.శంకరరావు శుక్రవారం ఓ ప్రకటనో తెలిపారు. దీంతో మేజర్‌పంచాయతీ హిరమండలం, పాతహిరమండలం,సుభలయ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నౌగూడ గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు, కొసమాల, రట్టిణి, సిరియాఖండి, వసుందర, పడసంద్ర, బందపల్లి తదితర గ్రామాలకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్న టెక్కలి ఈఈ శంకరరావు తెలిపారు. 11 కేవీ తిడ్డిమి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు తెలిపారు. మెయిన్ రోడ్డుతో పాటు మారుతీనగర్, లక్ష్మీనగర్, కంబకాయ రోడ్డు, శ్రీరాంనగర్, జయలక్ష్మీనగర్, పచూరీ కాలనీ, సౌభాగ్యలక్ష్మీనగర్, విజయలక్ష్మీనగర్, శ్రీనివాసనగర్‌లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

### వాయిదా స్కూళ్లల్లో నేడు ఎన్నికలు

హిరమండలం: మండలంలోని వాయిదా పడిన స్కూళ్లల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీన జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో మండలంలోని గొట్టా ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాల, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఈ పాఠశాలల్లో శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

● సామాజిక తనిఖీ



మెళియాపుట్టి మండలంలో సామాజిక తనిఖీ ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలైంది. సామాజిక భద్రతా పింఛన్లు, భవన నిర్మాణాల నాణ్యత, ఉపాధిహామీ పనులను డీఆర్పీలు పరిశీలిస్తున్నారు. కేరాసింగి పంచాయతీలో పింఛనదారుల పుస్తకాలను పరిశీలించారు. మొదటి విడతగా పది గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఆర్పీ రామారావు తెలిపారు. –మెళియాపుట్టి

● శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో శుక్రవారం శ్రావణ మాస ఏకాదశి సందర్భంగా స్వామి వారికి తిరువీధి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీముఖలింగేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు. పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి తిరువీధి నిర్వహించారు. – జలుమూరు

● శోభయాత్ర



సారవకోట మండలం గొర్రిబంద గ్రామంలోని సంతోషిమాత ఆలయంలో సామూహిక కుంకుమార్చనలను శుక్రవారం నిర్వహించారు. అలాగే గ్రామాల్లో కలశాలతో శోభాయాత్రను నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సోమేశ్వరరావు మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. –సారవకోట

# బారులుదీరుతున్న వాహనాలు!

● రెండు గ్రామాల ప్రజలు ఇక్కట్లు



అంగూరు-సోమరాజపురం రోడ్డుపై బారులుదీరిన ట్రాక్టర్లు

కొత్తూరు: కొత్తూరు మండలం అంగూరు స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక లోడింగ్ కోసం రోజు భారీగా ట్రాక్టర్లు, లారీలు వస్తున్నాయి. దీంతో అంగూరు, సోమరాజపురం గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు రెండు గ్రామాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పలు ఇక్కట్లు పడుతున్నారు. శుక్రవారం వద్దకు వెళ్లేందుకు వచ్చిన సుమారు 150 వాహనాలను అంగూరు, సోమరాజపురంతో పాటు ఆకులతంపర రోడ్డుపై నిలుపుదల చేశారు. దీంతో ఇతర వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుపై ప్రజలు నడవడానికి స్థలం లేక పలు అవస్థలు పడ్డారు. ఇసుక లోడింగ్ కోసం గంటల తరబడి వాహనాలు డ్రైవర్లు నిరీక్షిస్తున్నారు. ఇసుక కోసం వచ్చిన వాహనాలు గంటల కొద్దీ నిలిచి ఉంటుండడంతో ట్రాఫిక్ అవస్థలు ఎదుర్కొంటున్నామని ఈ ప్రాంతీయులు వాపోతున్నారు. సోమరాజపురం పాఠశాల రోడ్డుకు అనుకొని స్టాక్ పాయింట్ ప్రాంతం ఉన్నందున విద్యార్థులు రోడ్డు మీదకు వచ్చినట్లయితే ప్రమాదాలు పొంచిఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక కోసం వచ్చే వాహనాలను నియంత్రించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన తరువాత.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారణం చేసిన అనంతరం రైతు సంక్షేమాన్ని విస్మరించారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని ఎన్నికల ముందు అనేక ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే అందించారని అన్నారు. అయితే కూటమి సర్కార్ ఈ ఏడాది విత్తనాలను అరకొరగా అందించారన్నారు. అప్పుటికే రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేశారని చెప్పారు. ఇప్పుడు ఎరువులదీ అదే పరిస్థితి అన్నారు. రైతు సేవా కేంద్రాల కంటే ప్రైవేటు వ్యాపారులకు ఎరువులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు వ్యాపారులను చంద్రబాబు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వం రంగంలో ఉన్న రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ద్వారా ఎందుకు ఎరువులు విక్రయించటం లేదని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల యాజమాన్యులు ఇచ్చిన కమీషన్లకు కక్కుర్తిపడి రైతులకు మోసం చేస్తున్నారని వివరించారు. ప్రతీ రైతుకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే మూడు నెలల కాలం గడిచిపోయిందన్నారు. పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు సర్కార్ రైతుల వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. రైతు సంక్షేమాన్ని పక్కన పెట్టి రెవెన్యూ సదస్సులు పేరుతో కాలయాపన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతుందన్నారు. భూముల రీసర్వేలో తప్పులు జరిగాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు నష్టం జరిగిందని అధికారులు ప్రకటించారని, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం అందివ్వాలని, ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలని, పంటల నష్టం జరిగిన రైతులకు పెట్టుబడి సాయాన్ని తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు.

# మట్టిలో కూరుకుపోయిన లారీ



రోడ్డులో దిగబడిన లారీ

సరుబుజ్జిలి: భారీలోడ్‌తో కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ అలికాం-బత్తిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు సరుబుజ్జిలి జంక్షన్ వద్దగల గుంతలో శుక్రవారం దిగబడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ ప్రదేశంలో సుమారు పది రోజులుగా వర్షంనీరు చేరడంతో భారీగుంతలు ఏర్పడ్డాయి. దీనిపై ఇటీవల గ్రావెల్ వేశారు. అయితే ఏమాత్రం గట్టిపడకుండా వాహనాలు వెళ్తుండడంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

### ఉపాధి వేతనదారులకు బకాయిలు జమ

సారవకోట: మండలంలోని ఉపాధిహామీ వేతనదారులకు ఏప్రిల్ నుంచి బకాయి ఉన్న వేతనాలు వారి ఖాతాలకు జమైనట్టు ఏపీఓ నారాయణరావు శుక్రవారం తెలిపారు. మండలంలో 10,734 మంది వేతనదారులకు సుమారు రూ. 3.5 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

### 18న మండల సమావేశం

సరుబుజ్జిలి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో బి.ఎస్.వి.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వాస్తవంగా ఈ నెల 21వ తేదీన జరగాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాలతో ముందుకు మార్పు చేశామన్నారు. ఈ మార్పును సభ్యులు, అధికారులు గమనించాలని కోరారు. 18న ఉదయం పది గంటలకు ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

### గౌతు లచ్చన్నకు నివాళులు

ఎల్.ఎన్.పేట: సర్దార్ గౌతు లచ్చన్న రాజకీయాలతో పనిలేకుండా ఆదర్శనీయమైన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు అన్నారు. శుక్రవారం లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వరుస నాట్లుతో ప్రయోజనాలు



వరుస క్రమంలో నాట్లు వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: వరుస క్రమంలో వరినాట్లు వేయడం ద్వారా పంటకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీకి చెందిన రైతు అంపిలి బుచ్చిబాబు పొలంలో వరినారు చిగుళ్లను చింపి వరుస క్రమంలో నాట్లను శుక్రవారం వేయించారు. ఇలా నాటడం వలన దుబ్బుకు గాలీవెలుతురు బాగా తగిలి చీడపీడలు సోకవని, దిగుబడి బాగుంటుందని రైతులకు అవగాహన కల్పించారు. కొత్తూరు వ్యవసాయ సహాయకులు వసంత, దివాఖర్‌లతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# పాతపట్నంలో భారీ వర్షం

● లోతట్టు ప్రాంతాలు జలమయం



మెళియాపుట్టిలో కురుస్తున్న వర్షం

పాతపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పాతపట్నం మండల కేంద్రంలో సుమారు గంటన్నర పాటు ఏకదాటిగా వర్షం కురిసింది. వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అలాగే కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, రొంపివలస, గంగువాడ, ఆర్.ఎల్.పురం, తెంబూరు తదితర గ్రామాల్లో సైతం వర్షం కురిసింది.

**మెళియాపుట్టిలో..**

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలంలో కూడా భారీ వర్షం కురిసింది. ఇటీవల వర్షాల్లేక వరిపంట పొలాలు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షం జీవం పోసింది. మెళియాపుట్టి, కొసమాల, పెద్దపద్మాపురం, చాపర, జాడుపల్లి తదితర గ్రామాలలో భారీ వర్షం కురిసింది.



పాతపట్నం: పాతపట్నంలో వర్షం పడుతున్న దృశ్యం



మెళియాపుట్టి: వసుంధరలో పంటపొలాల్లో చేరిన నీరు

# వరలక్ష్మీతల్లి దయచూపమ్మా..



కొత్తూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వరలక్ష్మీతల్లి దయచుపమ్మా అన్ని భక్తులు వేడుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో చేశారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలు, సంతోషిమాత, వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, దర్శనాలు, ఏకవార అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. ఇళ్లల్లో కూడా సంప్రదాయబద్ధంగా వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆమదాలవలస: శివాలయంలో అర్చకుడి పూజలు



ఎల్.ఎన్.పేట: మోదుగువలస శివాలయం వద్ద పార్వతీదేవికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు



పాతపట్నం: పూజలందుకున్న శ్రీనీలమణిదుర్గ అమ్మవారు



నరసన్నపేట: తామరాపల్లి వేంకటేశ్వరాలయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



జలుమూరు:శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు



జలుమూరు: పూజలు చేస్తున్న భక్తులు



కొత్తూరు: గూనభద్ర అపోజిట్ ఆర్‌ఆర్ కాలనీలోని వనమహాలక్ష్మి ఆలయంలో సామూహిక వ్రతాల్లో మహిళలు



నరసన్నపేట: తామరాపల్లి సాంబజగదీశ్వరాలయంలో సామూహిక వ్రతాలు